జీడీఏ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ నల్లకుంటలోని రంజిత్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (జీడీఏ) కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ రంజిత్‌కౌర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ క్రిస్టియన్ మైనార్టీ యువత నుంచి ఈ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన 18 సంవత్సరాలు నిండిన వారు, జాబ్ చేయాలనే ఆసక్తి ఉన్న వారు ఈ కోర్సుకు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిగా ఐశ్వర్య

ముషీరాబాద్: రంగానగర్‌లోని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) వైద్యాధికారిగా డాక్టర్ ఐశ్వర్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు.సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

వేముల అశోక్‌కు సన్మానం

కవాడిగూడ: రాష్ట్రంలో ఎక్కడ ఏ ఎన్నికలు జరిగినా బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ సూచించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన వేముల అశోక్‌ను శనివారం దోమలగూడలోని కార్పొరేటర్ కార్యాలయం వద్ద నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.వెంకటేష్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, కె.పరిమల్‌కుమార్, ఎంసీ మహేందర్ బాబు, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌ల పట్ల జాగ్రత్త వహించాలి

చిక్కడపల్లి: చిక్కడపల్లి పీఎస్ పరిధిలో ఫోన్లు పోగొట్టుకున్న 39 మందికి శనివారం ఏసీపీ రమేశ్‌కుమార్, డీఐ శంకర్ ఆ ఫోన్ల యజమానులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... సినిమా థియేటర్లు, రద్దీ ప్రాంతాల్లో చాలా మంది ఫోన్లను పోగొట్టుకుంటున్నారని అన్నారు. అదే విధంగా అజాగ్రత్తగా ఉండటంతో దొంగలు చోరీ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐ, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్ లక్ష్మీదేవమ్మకు నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఐద్వా రాష్ట్ర నాయకురాలు ఎన్‌ఎస్ లక్ష్మీదేవమ్మ ప్రథమ వర్ధంతి సభను శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళల సమాన హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధురాలు లక్ష్మీదేవమ్మ అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా అధ్యక్షురాలు ఆర్.అరుణ జ్యోతి, బుగ్గ వీటి సరళ, పి.శశికళ, మస్తాన్, బీఎల్ కవిత, వి.కవిత తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కాచిగూడ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి ప్రజలకు సూచించారు. శనివారం నింబోలిఅడ్డలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె పాల్గొని రోగులకు మందులను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది ప్రజలను పరీక్షించి వారికి అవసరమైన సూచనలు సలహాలు చేశారు. ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్‌పటేల్ గౌడ్, డాక్టర్ తరుణ్, శ్రీనివాస్, మల్లికార్జున్, భీమ్‌రాజ్, అనిల్, సూరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్చక ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

కాచిగూడ: అర్చక ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, పెన్షన్, హెల్త్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ డిమాండ్ చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ శైలజ రామయ్యర్‌కు శనివారం వినతి పత్రాన్ని ఆయన అందజేశారు. నూతనంగా ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమితులైన సందర్భంగా శైలజ రామయ్యర్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దేవాదాయ శాఖ నుండి మరిన్నీ సేవలను భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని శైలజ రామయ్యర్ తెలిపారు.

ఘనంగా ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

చిక్కడపల్లి: న్యాయశాస్త్రం అనేది సామాజిక మార్పులకు అణుగుణంగా మారుతుందని.. న్యాయశాస్త్రాన్ని వృత్తిగా పరిగణలోకి తీసుకునే వారు జీవితాంతం న్యాయ విద్యార్థిగా ఉండి న్యాయ శాస్త్రాన్ని అభ్యసించాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వి.శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం చిక్కడపల్లి పెండెకంటి న్యాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ విద్యాసంస్థల అధ్యక్షుడు పి.రామ్మోహన్, కార్యదర్శి ఎం.పార్థసారథి, కోశాధికారి ఆనంద్, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డా. అరవింద, వైస్ ప్రిన్సిపల్ డా. శోభారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని పురస్కారాలు అందుకున్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే
నేరాల నియంత్రణ

చిక్కడపల్లి-గాంధీనగర్ ఏసీపీ యాదగిరి



కవాడిగూడ: విజిబుల్ పోలీసింగ్ విధానంతో ప్రజలతో మమేకం అవుతున్నామని తద్వారా శాంతి భద్రతలను పరిరక్షిస్తామని గాంధీనగర్ ఏసీపీ యాదగిరి పేర్కొన్నారు. నిర్జన ప్రదేశాలు, వ్యాపార వాణిజ్య కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు. గస్తీని మరింత పటిష్టం చేస్తామని పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. ఏసీపీ యాదగిరి పలు విషయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

ప్రశ్న: ఏసీపీగా బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు పూర్తయ్యాయి. ఈ కాలంలో జరిగిన మార్పులు ఏమిటి?

జవాబు: హైదరాబాద్ సీపీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తున్నాం. దీంతో హత్యల ఊసే లేకుండా పోయింది. దొంగతనాలు సైతం చాలా వరకు తగ్గిపోయాయి. స్టాప్‌లు, జనరద్దీ ప్రదేశాలలో జరిగే అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టి నిర్మూలించగలిగాం.

ప్రశ్న: శాంతి భద్రత పరిరక్షణకు తీసుకున్న చర్యలు ఏంటి?

జవాబు: విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తున్నాం. జనంతో మమేకం కావడం ద్వారా నేర ప్రవృత్తి పరిస్థితులను ముందుగానే పసిగట్టగలుగుతున్నాం. అంతేకాకుండా అన్ని పీఎస్ పరిధిలో పెట్రోలింగ్ పటిష్టం చేశాం. పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచుతున్నాం. తద్వారా వారు తమ ప్రవృత్తిని వీడి ఉపాధి మార్గాల వైపు దృష్టి సారిస్తున్నారు.

ప్రశ్న: గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: మాదక ద్రవ్యాలను సరఫరా చేసిన కొనుగోలు చేసిన నేరంగా పరిగణిస్తాం. కేసులు నమోదు చేస్తున్నాం. ఇప్పటికే పని విద్యా సంస్థల్లో గంజాయి డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించాం. ఖాళీ ప్రదేశాలు, లాడ్జీలు, పార్కులు, పాన్‌షాపులో వారానికి రెండు సార్లు తనిఖీలు చేపడుతున్నాం.

ప్రశ్న: ఇటీవల కాలంలో సైబర్ క్రైమ్‌లు పెరిగిపోయాయి. బాధితులు ఎవరికీ ఫిర్యాదు చేయాలి?

జవాబు: సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోషల్ మీడియా ఇతర వేదికల ద్వారా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నప్పటికీ సైబర్ మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ క్రైమ్ కేసులన్నీ పోలీస్ స్టేషన్ పరిధిలో స్వీకరిస్తున్నాం. ఆపైనా జరిగిన కేసులను హైదర్‌గూడలోని సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

ప్రశ్న: అత్యవసర సమయాల్లో పోలీసు సహాయం పొందాలంటే ఎలా?

జవాబు: ప్రజలు ఎప్పుడైనా డయల్ 100కు ఫోన్ చేయవచ్చు. ఫోన్ చేసిన 5 నుంచి 10 నిమిషాల్లో మా సిబ్బంది చేరుకొని బాధితులకు బాసటగా నిలుస్తారు.

కేంద్ర ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాలి



కాచిగూడలో జరిగిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ వెంకటాచలం

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ విధానాలలో మార్పు రావాల్సిన అవసరం ఉందని... అంతే తప్ప వికసిత భారత్, అమృత్ కాల్ అంటూ సామన్య ప్రజలను ఇంకా మోసం చేయలేరని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి సీహెచ్ వెంకటాచలం అన్నారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ అసోసియేషన్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ యూనియన్ త్రైవార్షిక సభలు శుక్రవారం కాచిగూడలోని మ్యాడం అంజయ్యహాల్‌లో జరిగాయి. ఈ మహాసభలను సీహెచ్ వెంకటాచలం ప్రారంభించి మాట్లాడారు. వికసిత భారత్, అమృత్ కాల్ అంటే కేవలం అదానీ, అంబానీలకే చెల్లుతుందని విమర్శించారు. ఇది పేద ప్రజలకు, కార్మికులకు కాదన్నారు. వ్యవసాయం, ఉత్పత్తి రంగాలు చిన్న తరహా పారిశ్రామిక రంగం కూడా అతలాకుతలం అవుతోందని ఆరోపించారు.

◆ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.... ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటేనే దేశం మనుగడ సాధ్యం అవుతుందని అన్నారు. బ్యాంక్ ఉద్యోగుల హక్కులు కాపాడటంలో ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. భారత బ్యాంకింగ్ సెక్టార్ ప్రధాన యూనియన్‌కు నేతృత్వం వహిస్తున్న వెంకటాచలం బ్యాంకింగ్ సంఘాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారని అభినందించారు. ప్రపంచం ఆర్థిక మాద్యం ఎదుర్కొన్నపుడు ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు మాత్రమే దేశాన్ని కాపాడాయని అన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిరక్షణ కోసం ఏఐబీఈఏ పోరాటం చేసి ప్రభుత్వ రంగం బ్యాంకులను నిలబెట్టుకోగలిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు, సెంట్రల్ బ్యాంక్ జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్, ఏఐబీఓఏ ప్రధానకార్యదర్శి సంజయ్‌కుమార్, కృష్ణమోహన్, పి.సతీష్ బాబు, టి.రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మాదకద్రవ్యాలను అరికట్టాలి

మంత్రి జూపల్లిని కలిసిన ప్రతినిధులు



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న పీఓడబ్ల్యూ, పీవైఎల్ ప్రతినిధులు

ముషీరాబాద్: డ్రగ్స్, గంజాయి సమాజంలో స్లో పాయిజన్‌లా విస్తరిస్తున్నా ప్రభుత్వం ఎందుకు అరికట్టలేకపోతోందని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు డి.స్వరూప, పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రవికుమార్ ప్రశ్నించారు. అబ్కారీ భవన్‌లో సమావేశమైన మంత్రి జూపల్లి కృష్ణారావును శనివారం పీవైఎల్, పీవోడబ్ల్యూ ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. వ్యక్తులకు కుటుంబాలను తద్వారా సమాజాన్ని నిర్వీర్యం చేసే డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. గతేడాది రూ.100కోట్ల విలువ చేసే 100 కిలోల మెపీడ్ దొరికిందన్నారు. సంవత్సరం గడిచే సరికి రూ.వేల కోట్ల విలువ చేసే డ్రగ్స్ పట్టుబడిందన్నారు. వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు విఫలమవుతోందని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ... డ్రగ్స్ సమస్యపై శనివారం ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యానని పేర్కొన్నారు. దీని నిర్మూలనకు తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలపై లోతుగా చర్చించామని అన్నారు. డ్రగ్స్ మాదక ద్రవ్యాలని నిర్మూలించడంలో తగు నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. డ్రగ్స్‌పై ప్రజలు ఏ చిన్న సమాచారం ఉన్నా సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నగర అధ్యక్షుడు బీఎస్ కృష్ణ, పీఓడబ్ల్యూ నగర అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీబాయి, వరలక్ష్మి, దేవమణి, జయప్రసాద్, అంజమ్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.16లక్షలతో డ్రైనేజీ పనులు

అంబర్‌పేట: నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. శనివారం అంబర్‌పేట డివిజన్ న్యూ పటేల్‌నగర్‌లో రూ.16 లక్షల అంచన వ్యయంతో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. మౌలిక వసతులు కల్పించేందుకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

బతుకమ్మకుంట రోడ్డును సకాలంలో పూర్తిచేయండి

అంబర్‌పేట: బతుకమ్మకుంట ప్రాంతంలో చేపట్టిన ప్రధాన రోడ్డును నాణ్యత ప్రమాణాలతో గడువులోపు పూర్తి చేయాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. శనివారం రోడ్డు నిర్మాణ పనులను ఆమె అధికారులతో కలిసి పర్యవేక్షించారు. బతుకమ్మకుంట పునరుద్ధరణతో ఇక్కడి రోడ్డుకు అధిక ప్రాధాన్యం ఏర్పడుతోందని అన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రధాన రోడ్డు కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఉన్న దృష్ట్యా సకాలంలో పూర్తి చేయాలన్నారు.

ఘనంగా అశోక్‌నగర్ అసోసియేషన్ వార్షికోత్సవం

చిక్కడపల్లి: అశోక్‌నగర్ కల్చరల్, వెల్ఫేర్ అసోసియేషన్ 62వ వార్షికోత్సవ కార్యక్రమం శనివారం రాత్రి అశోక్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు పాల్గొని అలనాటి మధుర గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, నేత్ర వైద్యుడు వెంకటాచలం, ఎస్బీఐ మేనేజర్ సంతాజీ, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సొసైటీల ఖాతాల్లో నగదు జమచేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పిట్టల రవీందర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం చేప, రొయ్య పిల్లల పంపిణీకి కేటాయించిన రూ.122 కోట్ల నిధులను మత్స్యకారుల సొసైటీల ఖాతాలో నగదును వెంటనే జమ చేయాలని రాష్ట్ర మత్స్యశాఖ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిట్టల రవీందర్ మాట్లాడుతూ... టెండర్ల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే సొసైటీల అకౌంట్లలో నగదును జమ చేయాలని కోరారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని టెండర్లను రద్దు చేసి మత్స్య సొసైటీల అకౌంట్లలో నగదు జమ చేయాలని కోరారు. టెండర్లను పిలవడం వల్ల కొన్ని జిల్లాలోని కొద్ది మందికే మేలు జరుగుతుందని అన్నారు. మత్స్యకారులకు న్యాయం జరగాలంటే సొసైటీల ద్వారానే నగదును జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు గాలి సత్యనారాయణ, అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమైక్య జాతీయ కార్యదర్శి లెల్ల బాలకృష్ణ, సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ, హైదరాబాద్ జిల్లా మత్స్యశాఖ ఫెడరేషన్ అధ్యక్షురాలు కొప్పు పద్మ తదితరులు పాల్గొన్నారు.

బేడబుడిగ జంగాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ తూర్పాటి హనుమంతు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో బేడ బుడిగ జంగం కులస్తులకు రాజకీయంగా తగిన ప్రాధాన్యం కల్పించాలని బేడ బుడిగ జంగం జేఏసీ చైర్మన్ తూర్పాటి హనుమంతు డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బేడ బుడిగ జంగం హక్కుల పోరాట సమితి యూత్ ఫెడరేషన్, బేడ బుడిగ జంగం జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ.. ఎస్సీ 59 కులాల్లో బేడ బుడిగ జంగం ఒకటి అని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు దాటినా ఇంకా సంచార జాతులుగానే కొనసాగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం రావాల్సిన రిజర్వేషన్లు అందటం లేదన్నారు. బేడ బుడిగ జంగంలో కనీసం ఒక ఐఏఎస్, ఐపీఎస్ కూడా లేరని పేర్కొన్నారు. ముఖ్యంగా రాజకీయంగా పూర్తిగా వెనుకబడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును అమలు చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. అంతేకాకుండా బేడ బుడిగ జంగాలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు గగనం మంతప్ప, రాష్ట్ర అధ్యక్షులు గగనం శేఖర్, వ్యవస్థాపక వైస్ చైర్మన్ గగనం శ్రీనివాసులు, వెంకటస్వామి, విభూది వెంకటేషం, గౌరవ అధ్యక్షుడు సిరువాటి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చల్లా బాలరాజు, దూపం ఆంజ నేయులు, కోశాదికారి తూర్పాటి చిన్న కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవా పక్షాన్ని విజయవంతంగా నిర్వహించండి



బర్కత్‌పురలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

కాచిగూడ: బీజేపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 17వ తేదీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం నుంచి అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి వరకు సేవా పక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య పిలుపునిచ్చారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సేవా పక్షంపై నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. 17వ తేదీన రక్తదాన శిబిరాలు, 18వ తేదీన స్వచ్ఛ భారత్, ఆత్మ నిర్భర భారత్, వికసిత్ భారత్, స్కూళ్లలో చిత్రలేఖన పోటీలు, 21న పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ప్రతి పోలింగ్ బూత్‌లో విధిగా మొక్కలు నాటాని, 27వ తేదీన దివ్యాంగులకు పరికరాల్ని పంపిణీ చేయాలన్నారు. 28వ తేదీన జాతీయ అవార్డు గ్రహీతలకు అభినందన సత్కారాలు, అక్టోబర్ 2వ తేదీన గాంధీజీకి, లాల్ బహదూర్‌శాస్త్రీకి పుష్పాంజలి ఘటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.గౌతంరావు, తూళ్ల వీరేందర్ గౌడ్, గణేష్, భరత్ గౌడ్, రాంభూపాల్‌రెడ్డి, నిరంజన్, ఉమా మహేందర్, వి.శ్రీనివాస్ రెడ్డి, కన్నె ఉమా రమేష్ యాదవ్, ఎడెల్లి అజయ్ కుమార్, వై.అమృత, వెంకటస్వామి, శ్యామ్‌రాజ్, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌లను రద్దు చేయాలి



కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న శివసేన (యూబీటీ) నేతలు

కాచిగూడ: భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌లను రద్దు చేయాలని శివసేన (యూబీటీ) తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.సుదర్శన్, గ్రేటర్ అధ్యక్షుడు గౌట్ గణేష్ డిమాండ్ చేశారు. శివసేన (యూబీటీ) పార్టీ అధిష్టానం ఇచ్చిన ఆదేశాల మేరకు శనివారం కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద పార్టీ నేతలు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మహేష్, పి.రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, ధనరాజ్, గోపాల్, మదన్, మనోజ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చెక్కులను అందజేస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్



చెక్కును అందజేస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

ముషీరాబాద్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో దోహద పడుతుందని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం భోలక్‌పూర్‌కు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్‌తో కలిసి అందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కావాల్సిన నిధులను అందజేస్తున్నదని పేర్కొన్నారు. పేదలను అన్ని విధాలా ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, నాయకులు రహీమొద్దీన్, యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగపాక వెంకట్, అభిషేక్ కెనడీ, షాంద్‌ఖాన్, ఫయాజ్, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.60వేల చెక్కు అందజేత

నల్లకుంట: నల్లకుంటకు చెందిన పీతాంబర్ మోతీలాల్ వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ వై.అమృతతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు లంకలా దీపక్‌రెడ్డి, ఎ.అజయ్ కుమార్, లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో పేదరిక నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమాచార హక్కు కమిషనర్ డి.భూపాల్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజా పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ... ఉపాధి హామీ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, జెండర్ బడ్జెట్, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై ప్రజా పర్యవేక్షణ కమిటీ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రజా పర్యవేక్షణ కమిటీ జాతీయ కన్వీనర్ సత్యబాబు బోస్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రజల శ్రేయస్సు, సాధికారత కోసం తమ వంతుగా కృషి చేస్తున్నామని అన్నారు. గత 20సంవత్సరాల క్రితం ఇందిరా జలప్రభ పథకం ద్వారా ప్రభుత్వంతో కలిసి పనిచేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కన్వీనర్ శివలింగం, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, ఆర్.వెంకట్‌రాములు, బి.ప్రసాద్, శ్రీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధీర సమీరే గంగాతీరే.. పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి: రచయిత రవిమంత్రి రచించిన ధీర సమీరే గంగాతీరే.. పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం త్యాగరాయ గానసభలో జరిగింది. పుస్తకం మొదటి ప్రతిని తన అమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన మొదటి నవల అమ్మడైరీలోని కొన్ని పేజీల పుస్తకానికి పుస్తక ప్రియుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తక ప్రచురణకర్త శ్వేత, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

వేడుకగా గ్రాడ్యుయేషన్ డే

కాచిగూడ: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జేఎన్‌టీయూ వీసీ ప్రొ. టి.కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని అవంతి విద్యాసంస్థల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై డిగ్రీ పూర్తయిన విద్యార్థులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

ముషీరాబాద్: మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. శనివారం భోలక్‌పూర్‌లోని ఇందిరానగర్‌లో డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఆలీ, పార్టీ సీనియర్ నాయకులు నిజాంల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మిలాద్-ఉన్-నబీ బహిరంగ సభకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహ్మద్ ప్రవక్తా బోధనలు శాంతి, దయాగుణాన్ని ప్రసాదిస్తాయని అన్నారు. ఉత్సవాలను, ర్యాలీలను ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు రహీం, లోకేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ర్యాలీలో డీజేలు పెట్టొద్దు

ముషీరాబాద్: ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే మిలాద్-ఉన్-నబీ ర్యాలీలలో డీజేలు పెట్టొద్దని పీపుల్ అండ్ పీస్ కమిటీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సయ్యద్ ముక్తార్ హుస్సేన్ కోరారు. శనివారం గోల్కొండ చౌరస్తాలోని కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతసామరస్యాన్ని పెంపొందించే విధంగా మిలాద్-ఉన్-నబీ ర్యాలీలను జరుపుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలను ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుని ప్రభుత్వానికి, పోలీసులకు సహకరించాలని కోరారు. ఇటీవల జరిగిన గణేష్ నిమజ్జన ఉత్సవ వేడుకలు హైదరాబాద్‌లో మతసామరస్యాన్ని చాటాయని, అదే విధంగా ముస్లింలు కృషి చేయాలని ఆయన కోరారు.



భోలక్‌పూర్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్